
1974 ఆనంద దీపావళి కథల పోటీలో రెండవ బహుమతి పొందిన కథ

# నేలక్లాసు

శ్రీకారం రామ్మోహన్



"రెండు టిక్కెట్లు" అంటూ పది రూపాయలిస్తున్న మోటచేయి ఎవరిదా అని తలెత్తి చూసిన బుకింగ్ క్లర్కు, కౌంటర్లో నుంచి కనిపించిన బీద మొహాన్ని చూసి ఆశ్చర్యపోయాడు.

"ఇది మూడున్నర టిక్కెట్టు. నేల టిక్కెట్లు అటువేపు అమ్ముతారు" అన్నాడు సందేహంగా.

"తెలుసులే, పది నోటిస్తున్నానుగా. రెండు టిక్కెట్లియ్యి" అన్నాడు సత్తెయ్య రీపిగా. క్లర్కు ఆశ్చర్యం అతనికి ఆనందం కలిగించింది.

"తెలీదేమో అని చెప్పాను" అంటూ రెండు టిక్కెట్లు, మూడు రూపాయలు చేతిలో పెట్టాడు.

హుషారుగా రత్తాలు నుంచున్న దగ్గరికి వెళ్ళాడు టిక్కెట్లు జేబులో భద్రంగా పెట్టుకుంటూ.

రత్తాలు కొంచెం దూరంలో నేలక్లాసు టిక్కెట్లకోసం కొట్టుకుంటున్న జనాన్ని చూస్తోంది. అరుపులు.... ఈలలు.... పోలీసులు లాఠీలతో జనాన్ని వెనక్కి తోస్తున్నారు, దెబ్బలు తగిలినవాళ్ళు పోలీసుల్ని బూతులు తిడుతున్నారు. రత్తాలుకి క్రిందటిసారి తన మావకి తగిలిన దెబ్బ గుర్తొచ్చింది. క్యూ మధ్యలోకి దూకుతూండగా పోలీసులు ఇవతలికి లాగటానికి వేసినదెబ్బ. ఆ దెబ్బ తగిలిన మర్నాడు రిక్షా లాగటానికి చాలా బాధపడ్డాడు. ఈడికింత సినిమా పిచ్చి ఏమిటో... అనుకుంది అప్పుడు రత్తాలు.

ఇంకా బుకింగ్ మొదలుకాముందు దో బ్లాక్ టిక్కెట్లమ్మేవాడు. "నేల టిక్కెట్టు రూపాయి

పావలా" అంటూ మంత్రంలా చదువుతూ అంతటా తిరుగుతున్నాడు.

"రావే రత్తాలు. చూశావా ఈ టిక్కెట్లయితే ఎంత తేలిగ్గా దొరుకుతాయో!" అన్నాడు సత్తయ్య.

"ఎంత మావా?" అంది రత్తాలు.

"ఏడు రూపాయలు."

"దండగ" అంది అయిష్టంగా.

"పోనీలేవే. జన్మానికొక శివరాతిరి."

ఇద్దరూ బాల్కనీలోకి దారితీశారు. టిక్కెట్లు చింపుతూ ఇద్దరివంక వింతగా చూశాడు గేటువాడు.

"భయంగా ఉంది మావా" అంది రత్తాలు ఘోరమైన నేరం చేసినదానిలా తల దించుకుని నడుస్తూ.

"బయందేనికి? మనం దొంగతనానికెడు, తున్నామా? డబ్బులిచ్చాం. సినిమా చూస్తాం!"

థియేటర్‌లోని హైక్లాసు వెయిటింగ్ రూము రత్తాలు కళ్ళకి ఇంద్రభవనంలా కనిపించింది. ఎర్ర తివాసీతో కప్పబడిన పాలరాతిమెట్లు స్వర్గానికి దారి తీస్తున్నాయి. తన చెప్పులు లేని కాళ్ళతో నడిచి ఆ తివాసీకి పట్టిచేస్తే జైల్లో పెడతారేమోనని భయం వేసింది. ట్యూబ్‌లైట్ల కాంతిలో అక్కడ కూర్చున్నవారి ఖరీదైన దుస్తులు ధగ ధగ మెరుస్తున్నాయి. పట్టుచీరల గరగరలు, పరిమళాల ఘుమఘుమలు. ఆ వాతావరణంలో తమ ముతక బట్టలు, చింపిరి తలలు, తమ ఉనికి అక్కడ చాలా అసహజంగా, విపరీతంగా తోచింది రత్తాలుకి. అందరి చూపులు తమమీదే వున్నాయని గ్రహించిన సత్తయ్యకి గర్వం, రత్తాలికి సిగ్గు కలిగాయి.

"రావే బొమ్మలు సూద్దాం" అన్నాడు సత్తయ్య, షో కేసులో పెట్టిన సినిమా ఫొటోలవేపు వెడుతూ.

"ఒద్దు మావా, నాకు ఇక్కడ నుంచోవాలంటే సిగ్గుగా ఉంది. లోపలికి పోయి కూర్చుందాం" అంది రత్తాలు.

"సరేలే" అంటూ లోపలికి వెళ్ళారు. బాక్సులోనుంచి కింద హాలంతా కనిపిస్తోంది. నేలక్లాసులో జనం నిండిపోయారు. మెట్ల నిండా కూడా కూర్చున్నారు. కొందరు చోటు కోసం కొట్టుకుంటున్నారు. హాయిగా అంత ముందర కూర్చుని అరవై పైసలకి చూసే సినిమా ఇంత వెనకాల కూర్చుని మూడున్నరకి చూడటం ఏమీ నచ్చలేదు రతాలికి. సత్తయ్యకి మాత్రం సింహాసనంమీద తొలిసారి కూర్చున్న రాజకుమారుడికిమల్లే మహదానందంగా ఉంది.

"కుర్చీలు సూడు ఎంత మెత్తగా వున్నాయో" అన్నాడు సీటుని చేత్తో నొక్కుతూ.

"సర్లే. కానీ ఇంతకీ నీకీ పది ఎక్కడ దొరికింది? సెప్పనేలేదు" అని అడిగింది రత్తాలు.

సాయంత్రం రత్తాలు పనినుంచి రాగానే తన కోసం ఎదురు చూస్తున్నాడు సత్తయ్య.

"ఏంది మావా, ఈవేళ ఇంత తొరగా వచ్చేవు?" అంది. తను రోజూ పది దాటితే గాని రాని అతనివంక ఆశ్చర్యంగా చూసి.

"తర్వాత సెప్తాకాని ముందు బయల్దేరు ఇందాకట్నుంచీ సూస్తున్నా. అయిదు దాటింది. ఇంతాలీసం అయిందే?"

"ఈరోజు అమ్మగారు సాయంత్రం ఏడకో పోవాలిట. అందుకని పని ఎక్కు-



వయింది. ఇంతకీ ఏటి కత? ఉషారుగా వున్నవ్?"

"ఈరోజు సినిమా కెల్లాలి. నా సావిఁరంగా. సిన్నప్పట్నించీ అనుకున్నది ఈనాటికి ఈఁలుపడింది. ఈరోజు మనం మేడమీఁకూసుని సినిమా చూడాల!"

అది సత్తయ్య చిరకాల వాంఛని రత్తాలుకి తెలుసు. కాని ఎన్నడూ అతనికోరికతీరడానికి కావలసినన్ని డబ్బులు మిగల్లేదు. ఏ రోజు కారోజు గడవటమే గగనం. మూడు రూపాయలు పెట్టి సినిమా వెళ్ళేబదులు ముప్పై రకాలుగా అవసరాలు తీరుకోవచ్చు. అప్పటికీ ఎలాగో అరవై పైసలు మిగుల్చుకుని నెలకొకసారైనా నేల టిక్కెట్టు కొనుక్కుని సినిమా చూపొస్తాడు. తను ఎప్పుడో ఆరు నెలలకొకసారి వెడుతుంది. సత్తయ్య మాత్రం ఎప్పుడూ "రత్తీ మనిద్దరం ఒకసారి పెద్ద టిక్కెట్టు కొనుక్కుని అక్కడ కూర్చుని సినిమా సూడాలే. ఇంత సిన్నకోరిక తీరకపోతే ఎందుకీ ఎదవ బతుకు" అనేవాడు ఈ రోజు పైసలు ఎలా వచ్చాయో అర్థం కాలేదు.

"డబ్బు లెక్కడివి?" అంది రత్తాలు.

"ఇదుగో" అంటూ పది రూపాయల నోటు తీసి చూపించాడు.

"ఓలమ్మో పది రూపాయలే. ఎక్కడివి?"

"ఎక్కడివైతే ఏం? ఈ రోజుమాత్రం సినిమా కెల్లాల్సిందే."

"ఎదవ సినిమాకోసం పది రూపాయలందుకుగానీ. వారం రోజులు నూకలొస్తాయి ఇటియ్య."

"అదేం ఈల్లేదు. ఇదిమాత్రం నేనివ్వను. నువ్వు దబ్బున రా. మొదలెట్టేస్తారు" అంటూ తనమాట వినకుండా లాక్కొచ్చాడు. తనకిమాత్రం ఆ పదిరూపాయలు ఎక్కడివో తెలియలేదు. అందుకని మళ్ళీ అడిగింది.

"ఆ పది రూపాయలా? ఈ రోజుఇద్దరు బాబులు రిక్షాఎక్కి అక్కడ గాంధీనగర్‌లో దిగారు. సరేనా డబ్బులు తీసుకుని నేనొచ్చేశానా, తర్వాతసూస్తే ఒక పర్సు రిక్షాలో పడుంది. దాంట్లో మూడొందలు డబ్బుంది. నాకు జాలేసి మళ్ళీ ఆళ్ళింటికెళ్ళి తిరిగిచ్చేశాను. ఇంక దొరుకుతుందని ఆ బాబు అనుకోలేదుట. సంతోషంతో వద్దంటున్నా పది రూపాయలిచ్చి నువ్వు, మీ యావిడా సినిమా కెళ్ళండిరా అంటూ ఇచ్చాడు" అంటూ చెప్పాడు సత్తయ్య.

"సినిమా కెల్లమన్నది మాత్రం అబద్ధం" అంది రత్తాలు తన మావ నిజాయితీకి గర్వపడుతూ.

"నిజమే. పైగా నీలాంటి రిక్షావాళ్లు సినిమాల్లోనే ఉంటార్రా అని ఇదికూడా రిక్షావాడి కతేనుట. ఈ సినిమాపేరు చెప్పి ఎల్లమన్నాడు" అన్నాడు సత్తయ్య.

బాక్సు నెమ్మదిగా నిండుతోంది. కాని సత్తయ్య, రత్తాలు పక్కన సీట్లుమాత్రం ఖాళీగానే ఉన్నాయి. వీళ్ళలైను దగ్గరకు వచ్చి వీళ్ళనిచూసి విస్తుపోయి, ఆ లైనులో కూర్చుంటే మైలపడతామేమో అన్నట్టు వేరే లైనులో కూర్చుంటున్నారు అందరూ.

న్యూస్‌రీలు మొదలయింది, చీకట్లో వీళ్ళ లైను కూడా నిండటం మొదలు పెట్టింది. సినిమా మొదలు పెట్టేటప్పటికి వీళ్ళ పక్కసీట్లతో సహా అన్ని సీట్లు నిండిపోయాయి.

సినిమాలో హీరో బీద రిక్షావాడు. కాని ఆ రిక్షావాడు ఆ బాక్సులో కూర్చున్న వాళ్ళందరికన్నా మంచి బట్టలు వేసుకున్నాడు. చెల్లెల్ని కాలేజీలో చేర్పించి చదివిస్తున్నాడు. ఒక లక్షాధికారి కూతుర్ని రోజూ కాలేజీకి తన రిక్షాలో తీసుకువెడుతుంటే ఆ అమ్మాయి అతనిని ప్రేమిస్తోంది.

"మావా నువ్వు కాలేజీ అమ్మాయిల్ని ఎక్కించుకోకు. వాళ్లు నిన్ను ప్రేమిస్తే నా గతేంకాను" అంది రత్తాలు రహస్యంగా. సత్తయ్య ముసి ముసి నవ్వులు నవ్వుకుంటూ "ఊరుకో ఎర్రి మొకమా" అన్నాడు. కాని రత్తాలు ఊరుకోలేదు.

# ఎక్కట్లు

గుడులు గోపురాలు బడులు సత్రము లేర్ప
రించినట్టి దాతృసంచయమున
సగముమంది కల రసన్మార్గమునఁ గల్మి
గడనచేసినట్టి కలుషఖనులు.

దానములతోడ గంగా
స్నానమ్ములతోడ నఘము చావదు మనుజుం
డేనఃఫల మేనాఁటికి
నైనన్ గుడువంగవలయు ననివార్యముగన్.

తాతకూర్చిన సిరివిల్వ తండ్రి కొంత
యెఱుఁగు నెఱుగఁడు మనుమఁడొక్కింతయైనఁ
గాన మూఁడవతరములోఁ గలిమి నిల్వ
దనిరి పెద్దలు లోకంబు నరసియరసి.

తప్పు లెన్ని యున్నఁ దన రచనంబు స
గించువాఁడు కవికి మంచివాఁడు
నిజము సెప్పువాఁడు నింద్యుఁ డిఁకన్ మన
బాస యెట్లు బాగుపడు నయారె!

(ఎక్కట్లు ఒంటరి పద్యములు ముక్తకములు.)

'కళా ప్రపూర్ణ' తుమ్మల సీతారామమూర్తి

"మనం మన బుడ్డాడికి పలక కొనియ్యా లేక సత్తున్నాం గదా. ఇందులో 'ఈరో' సెల్లెల్ని బియ్యే గియ్యే ఎలా సదివిస్తున్నాడో?" అంది అమాయకంగా.

"సినిమాలో ఏవన్నా సేయచ్చు. ఇంక మాటాడకు" అన్నాడు విసుగ్గా.

హీరో హీరోయిన్ల పెళ్ళికి హీరోయిన్ తండ్రి ఒప్పుకోక పోవటంతో ఇంటర్వెల్ అయింది. లైట్లు వెలిగాయి.

"కూచోవే. ఇప్పుడే వస్తాను" అంటూ బయటికి వెళ్ళాడు సత్తయ్య. సరేనని తల ఊపింది.

హాలంతా కలయ చూస్తున్న రత్తాలు పక్కకి తిరిగి "అమ్మగారూ మీరూ ఈ సినిమాకే వచ్చారా?" అంటూ సంతోషంగా అరిచింది. తన పక్క సీట్లోనే మెరిసిపోతున్న అమ్మగారిని చూసి.

అరుపు విని పక్కకి తిరిగి రత్తాల్ని చూసిన అమ్మగారికి నోట మాట రాలేదు. పక్కలో పాముని చూసినట్టు అదిరిపడింది. దాదాపు ఝుడుసుకుంది.

"నువ్వు.... నువ్వు.... ఇక్కడికి?" అమ్మగారి గొంతు పెగల్లేదు.

"పనవ్వగానే ఇంటికి వచ్చానండీ. రాగానే మా మావ సినిమాకి లాక్కొచ్చాడు" అంది సిగ్గు లొలకపోస్తూ. అప్పటివరకు బెదురుగా, అసహజంగా పిలవుతున్న రత్తాలికి తన "అమ్మగారి"ని చూడగానే ప్రాణం లేచొచ్చింది. సంతోషంతో మొహం విప్పారింది.

"ఈడే మా మావ" అంది చిప్స్ పేకెట్లు తీసుకొస్తున్న సత్తయ్యని చూపించి. సత్తయ్య అయోమయంగా చూశాడు.

"మావా మా అమ్మగారు" అంటూ పరిచయం చేసింది. అప్పుడు అర్థమయింది సత్తయ్యకి.

"దండాలండీ అమ్మగారు."

ముందు లైనులో వాళ్ళంతా వెనక్కి చూసి నవ్వుకుంటున్నారు. అమ్మగారు కూర్చున్న మెత్తటి కుర్చీ ముళ్ళుగా మారింది. లైట్లు ఆరిపోయాయి. సినిమా మొదలైంది, అయిదు నిమిషాలు కాక మునుపే అమ్మగారు లేచి వెళ్ళిపోయింది.

"సినిమా బాగలేదా అమ్మగారు?" అడిగింది రత్తాలు. సమాధానం రాలేదు.

సినిమా జోరుగా సాగుతోంది. హీరోయిన్ తండ్రి తన కూతుర్ని తన మేనేజరుకిచ్చి చేయాలనుకుంటున్నాడు. హీరోయిన్ ఇంట్లోంచి పారిపోయి రిక్షావాళ్ళ గుడిసెల్లో ఉంటోంది. హీరోమీద హత్యానేరం మోపి జైల్లోకి తోయించాడు హీరోయిన్ తండ్రి. హీరో చెల్లెల్ని హీరొయిన్ పిడకలమ్మి చదివిస్తోంది. జైల్లోంచి పారిపోయిన హీరో తన మావగారు పెద్ద స్మగ్లర్ అని కనుక్కుని హీరోయిన్ సహాయంతోనే రహస్య స్థావరాలన్నీ గ్రహించి చివరికి జీపులో పారిపోతుంటే రిక్షాను జీపు కన్నా స్పీడుగా తొక్కేసి పోలీసులకు పట్టించడంతో సినిమా ముగిసింది.

సత్తయ్యకి హాలులోంచి బయటికి వస్తుంటే కలిగిన అసంతృప్తిఅల్లా క్లబ్ డాన్స్ సీనులో తను ఈలవెయ్యడానికి కుదరకపోవటం, నేల క్లాసులో కూకుంటే ఆమూడు నిమిషాలు ఈలేసేవాడు. ఇక్కడ బాగుండదని ఊరుకున్నాడు.

"కానీ మావా ఇది అన్యాయమే" అంది రత్తాలు దారిలో.

"ఏమిటి?"

"పాపం ఈళ్ళందరికీ కొంచెం మంచి కుర్చీలు వేసి ఎక్కడో ఎనక కూచోపెట్టి మూడు రూపాయలన్నర గుంజటం అన్యాయం కాదూ? ఇంక డబ్బునోళ్ళు దగ్గర అలా లాక్కోడమేనా?"

"మరి ఏం చేయమంటావ్?"

"అసలు నాకర్థంకాదూ. ఇన్ని క్లాసులు ఎందుకూ అందరికీ ఒకే రకం కురిసీలేసి అందరి దగ్గర ఒక్క రూపాయి తీసుకుంటే పోలా? ఎవరిష్టం వచ్చిన చోట వాళ్లు కూర్చుంటారు."

"అలా కుదరదు లేవే ఎర్రి మొకమా." అన్నాడు సత్తయ్య.

మర్నాడు ఇంటికొచ్చిన సత్తయ్యకి రత్తాలు ఏడుస్తూ కనపడింది.

"ఎందుకే ఏడుపు? ఏమయింది?"

"నీ సినిమా పాడుగాను. నెలకి పాతిక రూపాయలొచ్చే పనికాస్తా పోయింది. ఆ సినిమానోట్లో దుమ్ము పడ" అంటూ తిట్ట సాగింది.

"ఏమయిందే?"

"పొద్దున పనిలోకెళ్ళి 'అంట్లెయ్యండి అమ్మగారు' అని అడిగితే ఆమె 'నీకెందుకే ఈ పాచి పనులూ, నువ్వు మహరాణీలాగా కులుకుతూ మొగుడితో మూడురూపాయల టికెట్టుకి సినిమాల కెడతావయ్యే! నువ్వు పనిమనిషివంటే నమ్ముతారా ఎవరన్నా' అంటూ నానా తిట్లు తిట్టి, ఇంక పనిలోకి రానక్కర్లేదని చెప్పింది" అమాయకంగా చెప్పింది రత్తాలు.

తాము చేసిన తప్పేమిటో అర్థంకాక బుర్ర గోక్కుంటూ నిలుచుండిపోయాడు సత్తయ్య. ★

దీపావళి శుభాకాంక్షలతో

హేపీ వైన్స్

బాస్టియన్ రోడ్ :: కర్నూలు-518001